క్యాబ్ డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి: మేయర్

కార్పొరేషన్, నవంబర్ 16: క్యాబ్ డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు కోరారు. శనివారం స్థానిక బస్టాండ్ అడ్డా వద్ద రాష్ట్ర క్యాబ్స్ ప్రొటెక్ట్ ట్రేడ్ యూనియన్ 4వ వార్షికోత్సవానికి హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బర్కత్ అలీ, ఎడ్ల అశోక్, టీఆర్‌సీపీటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహ్మద్ అష్జల్, జిల్లా గౌరవాధ్యక్షుడు మహ్మద్ అతిఫ్ అతినా, నాయకులు షేక్ మీరా సాహెబ్, కొట్టె సంపత్‌రెడ్డి, బాబర్, పిట్టల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: నగర కమిషనర్

కార్పొరేషన్, నవంబర్ 16: నగరాన్ని గ్రీన్ సిటీగా మార్చేందుకు మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం నగరపాలక సంస్థ హరితహారం విభాగం సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, హరితహారం కార్మికులకు బయోమెట్రిక్ విధానం అమలు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే నగర పరిధిలో నాటిన ప్రతి మొక్క ఏపుగా ఎదిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో సమస్యలు లేకుండా చూడాలి

నగరంలో ఎక్కడా నీటి సరఫరాలో సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం నగరపాలక సంస్థకు చెందిన ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఫిల్టర్ బెడ్‌లో ఏమైనా మరమ్మతులు ఉంటే వెంటనే చేయించాలన్నారు. నీటి శుద్ధీకరణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దని ఆదేశించారు.

నూతన చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

కోర్టుచౌరస్తా, నవంబర్ 16: తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ దరావత్ శరత్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలో శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్త ప్రాసిక్యూటర్ల సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాసిక్యూటర్లనుద్దేశించి శరత్ మాట్లాడుతూ, నూతన చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, కేసుల విచారణ సమయంలో బాధ్యతగా వ్యవహరించాలని, నిందితులకు శిక్షలు పడేలా తమ వంతు కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రాసిక్యూటర్లు వృత్తిపరంగా ఎదురవుతున్న సమస్యలు, సందేహాలను తెలుపగా, వాటికి సలహాలు, సూచనలు ఆయన అందించారు. అనంతరం జగిత్యాల అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బొల్లం రాజేశ్ నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రేడ్ వన్ వేముల లక్ష్మీప్రసాద్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్, స్పెషల్ పీపీ చీటీ రామకృష్ణారావు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఆరెల్లి రాములు, గౌరు రాజిరెడ్డి, పెంట శ్రీనివాస్, జాన్సీ, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు.

నేర నియంత్రణకు ఫింగర్ ప్రింట్ డివైస్ వినియోగించాలి

మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి

- రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి
- నేర సమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి

రాంనగర్, నవంబర్ 16: నేర నియంత్రణలో భాగంగా పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ వినియోగించాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి పోలీస్ అధికారులకు సూచించారు. కమిషనరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో శనివారం కరీంనగర్ రూరల్ డివిజన్‌కు చెందిన పోలీసు అధికారులతో డివిజన్ స్థాయి నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేసేలా చూసుకోవాలన్నారు. వాహన తనిఖీల్లో పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ ఉపయోగించాలన్నారు. దీని వల్ల పాత నేరస్తులు పట్టుబడే వీలుంటుందన్నారు. అన్ని వర్గాలకు చెందిన ప్రార్థనా మందిరాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి, అవి పని చేసేలా చూసుకోవాలన్నారు. భౌతిక నేరాలు ఎక్కువగా నమోదయ్యే ప్రాంతాల్లో దృష్టి కేంద్రీకరించి, వాటిని అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. మోసపూరిత నేరాలకు పాల్పడి నమోదైన కేసుల్లో నిందితులపై కోర్టుల్లో వెంటవెంటనే చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని చెప్పారు. అలాగే యాక్సిడెంట్ జోన్, బ్లాక్ స్పాట్లను గుర్తించి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. డివిజన్ స్థాయిలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులు, పోక్సో కేసులపై సమీక్షించారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీలు శ్రీనివాస్, విజయ్ కుమార్, వెంకటరమణ, డివిజన్‌కు చెందిన ఎస్.హెచ్.వో. అధికారులైన ఇన్‌స్పెక్టర్లతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో అర్ధరాత్రి పోలీసుల స్పెషల్ డ్రైవ్

నగరంలో అర్ధరాత్రి రోడ్లపై సంచరించే యువతను కట్టడి చేసేందుకు వన్ టౌన్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. శుక్రవారం రాత్రి వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్ ఆధ్వర్యంలో సిబ్బంది పెట్రోలింగ్‌తో పాటు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. పెట్రోలింగ్‌లో భాగంగా నిలువ నీడ లేక ఫుట్‌పాతేలపై నిద్రిస్తున్న వారి వివరాలు సేకరించి, పునరావాస కేంద్రానికి తరలించారు. వృద్ధులను వృద్ధాశ్రమానికి తరలించడంతోపాటు భిక్షాటన చేస్తున్న కొంతమంది వెళ్లేందుకు సుముఖంగా లేకపోవడంతో వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. డ్రంకెన్ డ్రైవ్‌తో పాటు ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా అనుమానితుల వివరాలు సేకరించారు. బస్టాండ్, ఇందిరా చౌక్, కేబుల్ బ్రిడ్జి, వీక్లీ మార్కెట్ ప్రాంతాల్లో అర్ధరాత్రి జులాయిగా తిరుగుతున్న వారిని గుర్తించి 23 బైకులు, రెండు ఆటోలు, కారు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు.

అందరి సహకారంతోనే సంఘం అభివృద్ధి

చొప్పదండి, నవంబర్ 16: చొప్పదండి ప్రాథమిక సహకార సంఘం రైతులు, అధికారులు, పాలకవర్గం, సిబ్బంది అందరి సహకారంతోనే జాతీయస్థాయిలో గుర్తింపు పొంది అభివృద్ధి చెందిందని సంఘ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి పేర్కొన్నారు. సహకార వారోత్సవాల్లో భాగంగా శనివారం చైర్మన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా సహకార అధికారి శ్రీ రామానుజాచార్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడారు. సంఘం ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభించబోయే సేవల గురించి వెల్లడించారు. కార్యక్రమంలో రిటైర్డ్ జిల్లా సహకార అధికారి గుర్రం ఇంద్రసేనారెడ్డి, సంఘ ఉపాధ్యక్షుడు ముద్దం మహేశ్‌గౌడ్, పాలకవర్గ సభ్యులతోపాటు కార్యదర్శి కళ్యాణ్, తిరుపతిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

24న ఉమ్మడి జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

కొత్తపల్లి, నవంబర్ 16 : సిరిసిల్లలోని రైజింగ్ సన్ స్పోర్ట్స్ అకాడమీలో ఈనెల 24న ఉమ్మడి జిల్లాస్థాయి జూనియర్స్ అండర్-19 బాలుర టోర్నమెంట్, బాలికల సెలక్షన్స్ ట్రయల్స్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9441925807 సెల్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

కబడ్డీ క్రీడాకారులకు అండగా ఉంటా: చైర్మన్ వెలిచాల

కొత్తపల్లి, నవంబర్ 16: జిల్లాలోని కబడ్డీ క్రీడాకారులకు అండగా ఉంటానని, జిల్లా జట్టు క్రీడాకారులు రాష్ట్రంలోనే నంబర్‌వన్ స్థానానికి ఎదగాలని అసోసియేషన్ చైర్మన్ వెలిచాల రాజేందర్‌రావు సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌స్టేడియంలో కబడ్డీ కోచింగ్‌ను ఆయన పరిశీలించి క్రీడాకారులతో మాట్లాడారు. కబడ్డీ మ్యాట్, ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని క్రీడాకారులు కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు అమిత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మల్లేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్నేని సంపత్‌రావు, తుమ్మనపల్లి శ్రీనివాస్‌రావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి చెస్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థి ఎంపిక

కొత్తపల్లి, నవంబర్ 16 : స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్ పాఠశాలకు చెందిన కె. సుప్రీత్ మధ్యప్రదేశ్‌లో రేపటి నుంచి జరిగే ఎస్జీఎఫ్ జాతీయస్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యాడు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యా సంస్థల అధినేత డా. వీ నరేందర్‌రెడ్డి విద్యార్థిని అభినందించి జాతీయ పోటీల్లో సత్తాచాటాలని సూచించారు. కాగా, సుప్రీత్ నగరంలోని స్థానిక జీనియస్ చెస్ అకాడమీలో చదరంగ శిక్షణ పొందుతుండగా జాతీయ పోటీలకు ఎంపిక కావడంతో అకాడమీ నిర్వాహకులు సైతం అభినందించారు.

గ్రూప్- 3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లాలో 56 కేంద్రాలు.. 26,415 మంది అభ్యర్థులు

కలెక్టరేట్, నవంబర్ 16 : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రూప్-3 పరీక్షలు జిల్లాలో నేటి నుంచి రెండు రోజుల పాటు జరుగనున్నాయి. నిర్వహణ కోసం అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 26,415 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానుండగా, కరీంనగర్ సిటీ, రూరల్, కొత్తపల్లి, తిమ్మాపూర్ మండలాల్లో 56 కేంద్రాలు ఏర్పాటు చేశారు. సెంటర్లలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. మొత్తం 87 మంది అధికారులు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించనున్నారు. రెండు విడతలుగా నిర్వహించే పరీక్ష ఆదివారం ఉదయం, మధ్యాహ్నం సెషన్లుగా, సోమవారం ఉదయం జరుగనున్నది. అభ్యర్థులను కేంద్రాల్లోకి ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు, మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల వరకు మాత్రమే అనుమతించనున్నారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు గంట ముందుగానే చేరుకోవాల్సి ఉంటుందని అధికారులు వెల్లడిస్తున్నారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురాకూడదని, మహిళా అభ్యర్థులు ధరించే మంగళసూత్రం, గాజులు, సంబంధిత వస్తువులు మినహాయించి, ఇతరత్రా ఏ వస్తువులు కూడా అనుమతించబోరని శనివారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ పమేలా సత్పతి స్పష్టం చేశారు.టీజీఎస్‌పీఎస్సీ నిబంధనలు పాటిస్తూ, సజావుగా పరీక్షల నిర్వహణకు సహకరించాలని సూచించారు.

సీఎం సభా స్థలం పరిశీలన

కలెక్టరేట్, నవంబర్ 16: ఈనెల చివరి వారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా కేంద్రంలో పర్యటించనున్న నేపథ్యంలో, నిర్వహించబోయే బహిరంగ సభ కోసం కలెక్టర్ పమేలా సత్పతి, ఇతర అధికారులు కలిసి ఎస్సారార్ డిగ్రీ కళాశాల మైదానం, అంబేద్కర్ స్టేడియంతో పాటు ఇతర చోట్ల స్థలం పరిశీలించారు. వేదిక, ప్రజలు కూర్చునే గ్యాలరీలు, పార్కింగ్ వంటి సౌకర్యాల కోసం అనువైన స్థలాన్ని, రోడ్ మ్యాప్‌ను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఆర్డీవో కె.మహేశ్వర్, ఇతర అధికారులు ఉన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేయకుండానే మెయింటనెన్స్

ముకరంపుర, నవంబర్ 16: నగరంలోని టౌన్-1 సబ్ డివిజన్‌లోని టౌన్-8 సెక్షన్ సబ్ స్టేషన్‌లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా మెయింటనెన్స్ పనులు చేపట్టారు. సాధారణంగా మెయింటనెన్స్ పూర్తయ్యే వరకు సబ్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాలకు సరఫరా నిలిపివేస్తారు. అయితే వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సమీప సబ్ స్టేషన్ నుంచి బ్యాక్ ఫీడింగ్ తీసుకుని మెయింటనెన్స్ సమయంలోనూ వినియోగదారులకు సరఫరాను అందించారు. ఎస్ఈ రమేశ్ బాబు మెయింటనెన్స్ పనులు పరిశీలించారు. టౌన్-1 ఏడీఈ పీ శ్రీనివాస్, ఏడీఈ టెక్నికల్ శ్రీనివాస్, టౌన్-8 ఏఈ ఫసి అహ్మద్, టెక్నికల్ ఏఈ శ్రీనివాస్, ఎస్ఎల్ఐ మహేందర్ రావు, ఎల్ఐ ఇంద్రసేనారెడ్డి, ఎల్ఎం ప్రకాశ్, రవి కుమార్, జితేందర్, రాజు, అనిల్, రమేశ్, చారి, శ్రీకాంత్, హరికుమార్, హరికృష్ణ, నాగరాజు ఉన్నారు.

ఆర్బీఐ రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు జమ్మికుంట విద్యార్థినులు

జమ్మికుంట, నవంబర్16: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) గత నెలలో ఆన్‌లైన్‌లో డిగ్రీ స్థాయి విద్యార్థులకు రాష్ట్రస్థాయి క్విజ్ ఎంపిక పోటీలు నిర్వహించగా, పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన బీఎస్సీ(బీజడ్‌సీఎస్) ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు సాయిషా, మేఘన సెలెక్ట్ అయ్యారు. కాగా, ఆర్బీఐ రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్ డాక్టర్ బీ రమేశ్, అధ్యాపకులు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. రేపు రాష్ట్రస్థాయిలో జరిగే క్విజ్ పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

జమ్మికుంట బస్టాండ్‌లోని షాపుల్లో డీఎం తనిఖీలు

జమ్మికుంట, నవంబర్16: జమ్మికుంట బస్టాండ్‌లోని షాపుల్లో డిపో మేనేజర్ రవీంద్రనాథ్, డిపో హెడ్ రవీందర్‌రెడ్డి, సూపరింటెండెంట్ నసీరొద్దీన్ ఆధ్వర్యంలో శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. పలు షాపుల్లో ప్రభుత్వ టెండర్లకు విరుద్ధంగా వస్తువులు అమ్ముతున్నట్లు గుర్తించారు. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వస్తువుల అమ్మకాలపై విచారణ చేశారు. అనంతరం పర్మిషన్ లేని వస్తువులు విక్రయిస్తున్న షాపు నిర్వాహకులు రాజయ్య, శ్రీకాంత్‌కు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున జరిమానా విధించారు. మరోసారి పట్టుబడితే రూ.2వేల జరిమానా విధిస్తామన్నారు. అధికారుల వెంట పీసీ రాంచందర్, సిబ్బంది, తదితరులున్నారు.

మాదిగ ఐక్య వేదిక మహార్యాలీ విజయవంతం చేయాలి

మహార్యాలీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాదిగ ఐక్య వేదిక నాయకులు

తెలంగాణచౌక్, నవంబర్ 16: ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న నగరంలో మాదిగ ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాదిగల మహార్యాలీని విజయవంతం చేయాలని మాదిగల ఐక్య వేదిక నాయకులు సముద్రాల అజయ్, గోస్కు శంకర్, సద్దాల లక్ష్మణ్ గజ్జల ఆనందరావు, బోయినిపల్లి చంద్రయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు నగరంలోని కోర్టు చౌరస్తాలో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం మహార్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మహార్యాలీ మధ్యాహ్నం 12.30 గంటలకు దుర్గమ్మ గడ్డ నుంచి ప్రారంభమై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగుతుందని తెలిపారు. మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్‌లో బాలల దినోత్సవం

కరీంనగర్ రూరల్, నవంబర్ 16: కరీంనగర్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు అబ్బాస్, తాలిబ్, కియానా, అగర్వాల్ చేసిన చక్కని స్వాగత ప్రసంగంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. విశిష్ట అతిథిగా డాక్టర్ మమతారెడ్డి హాజరయ్యారు. విద్యార్థుల వెంట్రిలాక్విజం, మ్యూజిక్, తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సృజనాత్మక థీమ్‌ల కింద ప్రదర్శనలు ఇచ్చారు. తల్లిదండ్రులు కూడా సాంస్కృతి కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభ ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబితా విశ్వనాథన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ట్రినిటి విద్యార్థి ఎంపిక

కొత్తపల్లి, నవంబర్ 16 : సంగారెడ్డి జిల్లాలోని సదాశివపేటలో ఈ నెల 16 నుంచి 18 వరకు జరుగనున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ట్రినిటి కళాశాల విద్యార్థిని టి మహిత ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు పేర్కొన్నారు. విద్యార్థినిని ట్రినిటి కళాశాలల వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి అభినందించారు.

బ్లూ బెల్స్ పాఠశాలలో సైన్స్ ల్యాబ్ ప్రారంభం

కమాన్‌చౌరస్తా, నవంబర్ 16 : నగరంలోని హనుమాన్‌నగర్ బ్లూ బెల్స్ పాఠశాలలో బాలల దినోత్సవం పురస్కరించుకొని శనివారం కేఐ ల్యాబ్స్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో విద్యార్థులతో సైన్స్ ల్యాబ్ (ప్రయోగాత్మక పరిశోధనలు) నిర్వహించారు. కేఐ ల్యాబ్స్ ఫౌండర్ సీఈవో కరీం ఇమ్రాన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన టీమ్ మెంటర్స్ ఐదో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్రయోగాలు పరిశోధనలు ఏ విధంగా చేయాలో క్లుప్తంగా వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ జంగా సునీతా మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రయోగాలు చేసి నేర్చుకోవడం వల్ల విద్యార్థులకు పాఠ్యాంశాలు త్వరగా అర్థమవుతాయన్నారు. ప్రతి నెలలో రెండు రోజులపాటు కేఐ ల్యాబ్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రాక్టికల్ ఎక్స్‌పర్‌మెంట్స్ చేయిస్తారని తెలిపారు.

వింధ్యావ్యాలీ విద్యార్థుల డీర్ పార్క్ సందర్శన

కొత్తపల్లి, నవంబర్ 16 : జిల్లా కేంద్రంలోని మెహర్‌నగర్ వింధ్యావ్యాలీ ప్రీ ప్రైమరీ తరగతుల విద్యార్థులు శనివారం ఎల్ఎండీ రిజర్వాయర్ సమీపంలోని డీర్ పార్కును సందర్శించారు. పాఠ్యాంశాల్లో భాగంగా పక్షులు, జంతువుల పరిశీలన తదితర అంశాలను విద్యార్థులకు ప్రత్యక్షంగా తెలియజేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వింధ్యావ్యాలీ పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీ ప్రకాశ్‌రావు పాల్గొని మాట్లాడుతూ, చూసి నేర్చుకునే అంశాలు త్వరగా విద్యార్థులకు అర్థమవుతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ రామవరం పృథ్వీరావు, ప్రిన్సిపాల్ జి. ప్రశాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు రైతు ఫిర్యాదు

మానకొండూర్ రూరల్, నవంబర్ 16: ఈదుల గట్టెపల్లి గ్రామ శివారులో సోనమ్ సీడ్స్ ప్రాసెసింగ్ ప్లాంటు నుంచి వెలువడుతున్న దుమ్ము, పొగ, గాలి కాలుష్యం వల్ల పంట పొలాలకు తీవ్ర నష్టం వాటిల్లడంతో పాటు అనారోగ్యం పాలవుతున్నట్లు అదే గ్రామానికి చెందిన రైతు దాసరి రాధాకృష్ణారెడ్డి శనివారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సీడ్ ప్లాంట్ యజమానికి పలుమార్లు మౌకికంగా తెలిపినా ఎలాంటి స్పందన లేదని, తనకు తీవ్ర నష్టం కలిగిస్తున్న కంపెనీపై చట్టపరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరినట్లు మీడియాకు వెల్లడించారు.

నేడు జిల్లాలో ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ పర్యటన

కలెక్టరేట్, నవంబర్ 16 : రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య ఆదివారం కరీంనగర్ రూరల్ మండలంలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12:30 గంటలకు మండలంలోని చర్ల బుత్కూర్ గ్రామంలో ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొని, అనంతరం ఒకటిన్నరకు తిరిగి హనుమకొండ జిల్లాకు బయలుదేరనున్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు మానేరు విద్యార్థులు

కొత్తపల్లి, నవంబర్ 16: నిర్మల్ జిల్లాలో ఈ నెల 17, 18 తేదీల్లో జరుగనున్న 68వ రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్ -14 బేస్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు కరీంనగర్‌లోని మానేరు విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు అక్షయ్ కార్తీక్, విష్ణువర్ధన్ ఎంపికైనట్లు విద్యాసంస్థల పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డితో పాటు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ జి. సరితారెడ్డి, పీఈటీలు మహేందర్, జహీద, తిరుపతి, స్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

తాడికల్ విద్యార్థుల ప్రతిభ

శంకరపట్నం, నవంబర్ 16: స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్మల్ పట్టణంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలకు తాడికల్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన అర్చన (9వ తరగతి), రిషిత (9వ), రామ్ చరణ్ (8వ) ఎంపికైనట్లు స్కూల్ హెచ్ఎం, ఎంఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను హెచ్ఎం లక్ష్మీ నారాయణతో పాటు స్కూల్ పీఈటీ ఆడెపు శ్రీనివాస్, ఉపాధ్యాయులతో పాటు అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ కొరిమి మాధవి, తల్లిదండ్రులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

శిశువు మృతదేహానికి పోస్టుమార్టం

హుజూరాబాద్ టౌన్, నవంబర్16: ఏరియా దవాఖానలో గురువారం అర్ధరాత్రి పుట్టిన ఆడ శిశువు వైద్యుల నిర్లక్ష్యంతో మృతి చెందిందని పట్టణానికి చెందిన కళ్లెం లక్ష్మి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శనివారం హుజూరాబాద్ శివారులో ఖననం చేసిన శిశువు మృతదేహాన్ని వెలికి తీసి, అధికారులు పోస్టుమార్టం జరిపించారు. వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ డాక్టర్ సురేందర్ హుజూరాబాద్ తహసీల్దార్ కే కనకయ్య, పట్టణ సీఐ తిరుమల్ గౌడ్, ఇతర వైద్య సిబ్బంది, కుటుంబ సభ్యుల సమక్షంలో పసికందు మృతదేహానికి పోస్టుమార్టం చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని అధికారులు తెలిపారు.

'శ్రీ వేదం'లో ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్

కమాన్‌చౌరస్తా, నవంబర్ 16 : జిల్లా కేంద్రంలోని శ్రీ వేదం ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకున్నది. ఈ సందర్భంగా విద్యార్థులు దాదాపు 116 రకాల ఆహార పదార్థాలను తీసుకువచ్చి, ప్రదర్శించారు. వాటి గురించి సందర్శకులకు వివరించారు. కార్యక్రమానికి హాజరైన తల్లిదండ్రులు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బొమ్మ శ్రీనివాస్ గౌడ్, ఏవో ప్రతాపరెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే

తిమ్మాపూర్, నవంబర్ 16: నుస్తులాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. కొన్ని అంశాలను ఎమ్మెల్యే వివరించారు. బాగా చదువుకోవాలన్నారు. ఇష్టంగా చదువుకుంటేనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. సర్కార్ బడి అని చిన్నచూపు వద్దని, తాను కూడా సర్కార్ బడిలోనే చదివానన్నారు. ఇక్కడ ఉపాధ్యాయులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి,